# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఉగ్రవాదం అంతమే లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్ కొనసాగిందని భారత త్రివిధ దళాల అధిపతులు స్పష్టం చేశారు.**

**2.** **బుద్ధ పూర్ణిమ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా జారీ చేయనున్న రేషన్ కార్డులను... స్మార్ట్ కార్డు రూపంలో ఉచితంగానే అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**4.** **తెలంగాణాలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కోరారు.**

**5.** **ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలో 5 లక్షల 24 వేల ఎకరాలకు రబీ పంటకు నీరు అందించామని ఆంధ్రప్రదేశ్ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు.**

==========================

ఉగ్రవాదం అంతమే లక్ష్యంగా ఆపరేషన్ సింధూర్ కొనసాగిందని భారత త్రివిధ దళాల అధిపతులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, భారత వైమానిక దళం డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతి, భారత నావికా వైస్ అడ్మిరల్ ఎఎన్. ప్రమోద్ స్పష్టం చేశారు. ఢిల్లీలో నిన్న జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ.... ఉగ్రవాదాన్ని అంతమొందించడంలో భాగంగా పాకిస్తాన్‌లోని కచ్చితమైన లక్ష్యాలపై దాడులు నిర్వహించామన్నారు. గగనతలం నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించామన్నారు. లక్ష్యాల సాధనలో భారత్ వైపు ఎలాంటి నష్టం లేకుండా కచ్చితమైన దాడులు చేశామని రాజీవ్ ఘాయ్ తెలియజేస్తూ...

.. వాయిస్ ..29 సెకన్లు

---------------------------

ఈ రోజు బుద్ధ పూర్ణిమ పర్వ దినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమిని బుద్ధ పూర్ణిమ వైశాఖ పూర్ణిమ అని పిలుస్తారు. వైశాఖ పూర్ణిమ రోజునే గౌతమ బుద్ధుని జననం జరిగిందని, అందుకే ఈ పర్వ దినాన బుద్ధ పూర్ణిమ వేడుకలు జరుపుకుంటారని చరిత్ర చెబుతోంది.

---------------------------

బుద్ధ పూర్ణిమ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బుద్ధుడు అహింస, ప్రేమ దయలను ఈ ప్రపంచానికి అందించారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుద్ధుని సిద్ధాంతాలు సమానత్వం, సౌహార్దం సామాజిక న్యాయం అని ఆమె తెలిపారు. ప్రజలు బుద్ధ భగవానుని ఆలోచనల నుంచి స్ఫూర్తి పొందాలని రాష్ట్రపతి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా జారీ చేయనున్న రేషన్ కార్డులను... స్మార్ట్ కార్డు రూపంలో ఉచితంగానే అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్న వారికి కూడా స్మార్ట్ కార్డులు అందజేస్తామని చెప్పారు. కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరసరఫరాలశాఖ కింద సేవలు అందుతాయని మంత్రి వెల్లడిస్తూ...

..వాయిస్.. 36 సెకన్లు

---------------------------

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ – 2025 పోటీలు ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ సుందరీమణులకు పరిచయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ ఈరోజు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించనున్నారు.ఇందుకు సంబంధించి పోలీస్ శాఖ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసింది.

---------------------------

తెలంగాణాలోని కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పర్యటించిన శ్రీధర్ బాబు.. ఈ నెల 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల మొదటి రోజు 15వ తేదీన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి హారతి కోసం కాశీ నుంచి ప్రత్యేక బృందాన్ని ఆహ్వానించినట్లు మంత్రి తెలియజేస్తూ....

..వాయిస్.. 28 సెకన్లు

---------------------------

రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గత నెల 10 తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్

కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామని అక్కడ విజయవంతం కావడంతో ఈరోజు నుంచి మరో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

-------------------------

ఉమ్మడి నెల్లూరు ,చిత్తూరు జిల్లాలో 5లక్షల 24వేల ఎకరాలకు రబీ పంటకు నీరు అందించామని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా 16 టీఎంసీల నీటిని ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాలోని 5 లక్షల 24 వేల ఎకరాలకు రెండో పంట కింద సాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాల్లో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా కండలేరు జలాశయం వద్ద 10 టీఎంసీల నీటిని నిల్వ చేశామని తెలిపారు.

-------------------------

సాంకేతికతను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయాలని... తెలంగాణా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, హైదరాబాద్ చాప్టర్ ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సహకారంతో జాతీయ సాంకేతిక దినోత్సవ వేడుకలు, వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన నిన్న హాజరయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ స్థాయి వరకు సామాన్య ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీని ఎంతగానో అభివృద్ధి చేస్తుందని గవర్నర్ ప్రశంసించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో విడత నామినేటెడ్ పదవులను నిన్న భర్తీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్ ని నియమించింది. ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ ని ఎంపిక చేసింది.. వీరితో పాటు మొత్తం 22 కార్పొరేషన్లు, కమిషన్‌లకు ఛైర్మన్‌లను నియమించింది. తెలుగుదేశం నుంచి 16 మందికి, జనసేన నుంచి ముగ్గురికి, భారతీయ జనతా పార్టీ నుంచి ఒకరికి, అమరావతి ఐక్య కార్యాచరణ సమితి నుంచి ఇద్దరికి అవకాశం కల్పించింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ – యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, దక్షిణ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఈరోజు, రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

కాగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని జిల్లాలకు 'నారింజ' రంగు హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరుగా వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

=====================